

బొడ్డపాడు ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని పలాస మండలం బొడ్డపాడు గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడు (ఫీల్డ్ అసిస్టెంట్)గా పనిచేస్తున్న పోతనపల్లి సరోజవర్మను విధుల నుంచి తప్పించినట్టు ఉపాధి హామీ సంచాలకుడు జి.వి.చిట్టి రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సరోజవర్మ రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నట్టు ఫిర్యాదు రావడంతో స్వయంగా విచారణ చేపట్టమని అన్నారు. పలాస రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ భరత్ నాయక్ ధ్రువీకరించారని తెలిపారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినట్టు స్పష్టం కావడంతో సరోజవర్మను విధుల నుంచి తొలగిస్తున్నట్టు కలెక్టర్ నుంచి ఉత్తర్వులు వచ్చాయని తెలిపారు. అదే గ్రామానికి వాలంటీర్ పి.విజయ్‌ను విధుల నుంచి తొలగించిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి భరత్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు.



వామ్మో.. ఎలుగు

- తరచూ దాడులతో ప్రాణాలను బలిగొంటున్న వైనం
- శనివారం దాడిలో ఇద్దరు మృతి, మహిళ పరిస్థితి విషమం
- భయాందోళనలో ఉద్దాన ప్రాంతం
- రక్షణ చర్యలు చేపట్టని ప్రభుత్వం



లోకనాథం మృతదేహం



కూర్మారావు మృతదేహం

ఉద్దానం ప్రాంతంలో రెండేళ్లుగా వజ్రపుకొత్తూరు, పలాస, మందస మండలాలోల తరచూ ఎలుగులు దాడులు చేస్తున్నాయి. ఎలుగు దాడుల్లో ప్రాణాలు బలికొంటున్నాయి. మరికొందరు గాయాల పాలవుతున్నారు. తాజాగా శనివారం వజ్రపుకొత్తూరు మండలం అనకాపల్లిలో ఎలుగు దాడిలో ఇద్దరు మృతి చెందగా, మహిళ తీవ్రంగా గాయపడింది. ఎప్పుడు ఏ ప్రాంతంలో ఎలుగు దాడి చేస్తుందనే భయం వారిని నిరంతరం వెంటాడుతోంది. జీడి తోటలే ఆధారంగా జీవనోపాధి పొందుతున్న రైతులు, కూలీలు పనులకి వెళ్లేందుకు భయపడుతున్నారు. వెలుగు దాడులు నిత్యకృత్యమవుతున్నా ప్రభుత్వం నుంచి రక్షణ చర్యలు కనిపించడం లేదు. అటవీశాఖ అధికారులు అవగాహన కల్పించడానికే పరిమితమవుతున్నారు.

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు, పలాస

వజ్రపుకొత్తూరు మండలం చీపురుపల్లి పంచాయతీ అనకాపల్లిలో శనివారం ఉదయం జరిగిన ఎలుగు దాడిలో అదే గ్రామానికి చెందిన చీడిపల్లి లోకానాథం (48), ట్రాక్టర్ డ్రైవర్ అప్పికొండ కూర్మారావు (47) అక్కడక్కడే మృతి చెందగా... లోకనాథం భార్య సావిత్రి తీవ్ర గాయాలు పాలైంది. ఘటనా పై కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా న్నాయి. వజ్రపుకొత్తూరు మండలం చీపురుపల్లి పంచాయతీ అనకాపల్లి గ్రామ సమీపంలో చీడపల్లి లోకనాథం, ఆయన భార్య సావిత్రి తన జీడి తోటలో శుభ్రం చేస్తున్నారు. సమీపంలో ఉన్న కొండ ప్రాంతం నుంచి అకస్మాత్తుగా ఎలుగు జీడి తోటలో చొరబడి ముందుగా లోకనాథంపై దాడి చేసింది. దీన్ని గమనించిన భార్య సావిత్రి సమీపంలో ఉన్న జీడి రైతు, ట్రాక్టర్ డ్రైవర్ అప్పికొండ కూర్మారావుకు ఫోన్ ద్వారా సమాచారం అందించింది. దీంతో కూర్మారావుతో పాటు మరో నలుగురు రైతులు ట్రాక్టర్‌పై ఘటనా స్థలానికి చేరుకున్న తరుణంలో సావిత్రిని విడిచి పెట్టి కూర్మారావుపై దాడి చేసి పొట్టన పెట్టుకుంది. దీనిని చూసిన గ్రామస్తులు ట్రాక్టర్‌పై దూకేసి స్వగ్రామానికి పారిపోయారు. కొద్ది సేపటి తరువాత సావిత్రిని 108లో పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం జిల్లా సర్వజనాస్పత్రికి రిఫర్ చేశారు. మృతుడు కూర్మారావు పంచాయతీలో వార్డు మెంబరుగా పనిచేస్తున్నారు. ఈయనకు భార్య కృష్ణవేణి, కుమార్తె విజయలక్ష్మి, కుమారుడు శ్రీకాంత్ ఉన్నారు. అలాగే లోకనాథంకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇదిలా ఉండగా మధ్యాహ్నం దాడి చేసిన ఎలుగుని గ్రామస్తులతో కర్రలతో దాడి చేసి హతమార్చారు. అనంతరం ఎలుగు ఘటనాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వజ్రపుకొత్తూరు ఎస్ఐ రామారావు తెలిపారు.

గతంలో...

రెండేళ్లుగా ఎలుగు బంటి దాడులు అధికమయ్యాయి. ఇప్పటి వరకు ఐదుగురు మృతి చెందగా, పలువురు తీవ్రగాయాల పాలయ్యారు. 2022 జూన్ 19న వజ్రపుకొత్తూరు మండలం కిడిసింగికి చెందిన కడమటి కోదండరావు జీడి తోటలో పనులు చేస్తుండగా ఎలుగు దాడిలో మృతి చెందారు. ఆ మరోసటి రోజు వజ్రపుకొత్తూరులో కలిసెట్టి అప్పలస్వామి, సిహెచ్.చలపతి, ఉప్పరపల్లి పురుషోత్తం, ఉప్పరపల్లి తాండేశ్వరరావు, సంతోష్, తామడ షణ్ముఖరావులపై దాడి చేసింది. తామడ షణ్ముఖరావు, సిహెచ్.చలపతిరావు మృతి చెందారు. ఈ ఏడాది ఫిబ్రవరి 24న చీపురుపల్లి పంచాయతీ ఎం.గూడూరుకు చెందిన మత్య్సకారుడు పి.కుమారస్వామి, డెప్పురుకు చెందిన లైసెట్టి నారాయణమ్మ, సీలం తాతారావు, ఊర్మిళపై దాడి చేసింది. ఒంకులూరుకు చెందిన నర్సు సింహాద్రి, గుంటు పోలమ్మ, పసుపు రడ్డి సింహాచలం, చిన్న వంకులూరుకు చెందిన దొక్కరి అప్పలస్వామి, సంతోష్ నగర్‌కు చెందిన గుంటి తులనాథం, సొండిపల్లి హేమసుందర్, శ్రీరామ్‌నగర్‌కు చెందిన లింగాల మహాలక్ష్మిపై దాడులు జరిగాయి.

మంత్రి పరామర్శ

ఎలుగు దాడిలో మృతి చెందిన లోకనాథం, కూర్మారావు మృతదేహాన్ని పశు సంవర్థకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పరిశీలించారు. అనంతరం వైద్యులతో మాట్లాడి క్షతగాత్రురాలు సావిత్రి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. బాధితులకు అండగా ఉంటామని, ప్రభుత్వం తరుపున ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యం

రెండేళ్లుగా ఉద్దాన ప్రాంతంలో తరచూ ఎలుగులు సంచరిస్తున్నా అటవీ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహించడం వల్లే జీడి రైతులు రైతులు, కూలీలు మృతి చెందుతున్నారని ఉద్దాన ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎలుగు దాడులు జరగకుండా నివారించాలని పదేపదే ఏడాదిగా అటవీశాఖ అధికారులు కోరుతున్నా పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేసవి సమీపిస్తున్న తరుణంలో కొండ ప్రాంతంలో తాగునీరు లేక జీడి పళ్ల తినేందుకు ఎలుగులు జీడి తోటల్లోకి వచ్చేస్తున్నాయని జీడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎలుగుల నియంత్రణకు చర్యలు

ఎలుగు జీడి తోటల్లో సంచరిస్తున్నాయని, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే పలుమార్లు రైతులకు అవగాహన కల్పించామన్నారు. ఎప్పటికప్పుడు ఉద్దాన ప్రాంతంలో తమ సిబ్బంది పర్యటిస్తున్నారు. ఎవరికైనా ఎలుగులు కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు. కవిపుచర్యలకు పాల్పడద్దని చెప్పాం. గతంలో ఎలుగు దాడిలో మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం రూ.5 లక్షలు చొప్పున పరిహారం చెల్లించాం.

- మురళీకృష్ణ, అటవీ శాఖ రేంజర్, కాశీబుగ్గ

పలుమార్లు ఫిర్యాదు చేశా



ఉద్దానంలో ఎలుగు దాడుల్లో మృతులు ముమ్మాటికీ అటవీశాఖ హత్యలే. ఉద్దానంలో ఎలుగు సంచారంపై అటవీశాఖకు చాలాసార్లు ఫిర్యాదు చేశాం. అటవీశాఖ అధికారులు స్పందించలేదు. అనకాపల్లికి చెందిన ఇద్దరు మృతి చెందడం అటవీశాఖ బాధ్యత వహించాలి. ఒకవైపు ఉద్దానంలో కిడ్నీ వ్యాధులు మరణ మృదంగం మోగిస్తుంటే... మరోవైపు ఎలుగు ప్రాణాలు తీస్తున్నాయని ఆందోళన కలిగింది. జీడి పంట చేతికి వచ్చే సమయంలో రైతులు జీడి తోటలకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ఎలుగులను అదుపు చేయడంలో అటవీశాఖ నిర్లక్ష్య ధోరణి కనిపిస్తుంది. మరిన్ని దాడులు జరగకుండా, ప్రాణ నష్టం జరగకుండా చూడాలి.

- కొండప్ప సురేఖ, మెట్టూరు ఎంపిటిసి

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

వజ్రపుకొత్తూరు మండలం అనకాపల్లిలో జరిగిన ఎలుగు దాడిలో మృతి చెందిన కుటుంబాలను తక్షణమే ఆదుకోవాలి. కొంత కాలంగా పలాస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలోని ఉద్దాన ప్రాంతంలో ఎలుగు విపరీతంగా సంచరిస్తూ మనుషుల ప్రాణాలను తీసుకున్నాయి. అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఉద్దాన ప్రాంతంలో ఎలుగు దాడులు జరుగుతున్నాయి. ఎలుగు బారినపడి మృతి చెందిన ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి.

- ఎం.వినోద్‌కుమార్, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గురుదాసుపురం

మృతదేహాలతో నిరసన

రెండేళ్లుగా ఉద్దాన ప్రాంతంలో ఎలుగు బంటి దాడిలో జీడి రైతులు, వ్యవసాయ కూలీలు మృతి చెందుతున్నా పాలకులు, అటవీ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఉద్దాన ప్రాంత ప్రజలు, మృతుల కుటుంబీకులు ఆందోళన చేపట్టారు. మృతదేహాలను ఘటనా స్థలం నుంచి అంబులెన్స్‌లో పలాస ప్రభత్వాస్పత్రికి తీసుకొస్తున్నారు. ఈ తరుణంలో వాహనాన్ని కాశీబుగ్గ బస్టాండ్ ఆవరణలో నిలిపివేసి మృతదేహాలతో ధర్నా చేపట్టారు. అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఉద్దాన ప్రాంతంలో జీడి రైతులు, వ్యవసాయ కూలీలు ఎలుగు దాడిలో మృతి చెందుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనకు బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు. అనంతరం పోలీసులను చుట్టిముట్టారు. చివరకు కాశీబుగ్గ, వజ్రపుకొత్తూరు ఎస్ఐలు పారినాయుడు, రామారావులు మృతుల కుటుంబ సభ్యులకు సద్ది చెప్పడంతో ధర్నాను విరమించారు. అనంతరం మృతదేహాలను పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీంతో గొడవ సద్దుమణిగింది.



పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న మృతుల బంధువులు

తప్పుడు ప్రచారాలకు పాల్పడితే చర్యలు

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉందని, ఆన్‌లైన్ వేధింపులు, సోషల్ మీడియా ట్రోలింగ్స్ ద్వారా తప్పుడు వార్తలు, ప్రచారాలకు పాల్పడే వారిపై నిఘా ఉంచామని ఎస్‌పి జి.ఆర్.రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. అట్టి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్ వంటి సోషల్ మీడియా వేదికగా తప్పుదారి పట్టించే సమాచారం, మార్ఫింగ్ చేసిన ఫొటోలను, వీడియోలను పోస్టు చేయడం, ఫార్వర్డ్ చేయకూడదని సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలను, నియమావళిని ఉల్లంఘించినట్లు గుర్తిస్తే హెల్ప్‌లైన్ నంబరు 1950కి, ల్యాండ్ లైన్ నంబరు 08942-240606కి ఫోన్ చేయాలన్నారు. www.cyber-crime.gov.inలో కూడా ఫిర్యాదు చేయవచ్చునన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి రాధిక

వాహనాలను తనిఖీ చేయాలి

రణస్థలం : సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో ప్రతివాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఎస్‌పి జి.ఆర్.రాధిక ఆదేశించారు. మండలంలోని పైడిభీమవరం ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టును శనివారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఇందులో భాగంగా వాహనాల రాకపోకలను పరిశీలించి తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. తనిఖీ కేంద్రాల వద్ద నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. నగదు, మద్యం, గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, తనిఖీలను వీడియో కెమెరా పర్యవేక్షణలో రికార్డు చేయాలని ఆదేశించారు. ఈమె వెంట టౌన్ డిఎస్‌పి శృతి ఉన్నారు.



మందస : చెక్‌పోస్టు వద్ద పోలీసుల నుంచి వివరాలు సేకరిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

హింసకు తావు లేదు

జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- మందస, నందిగాం, పలాస

హింసకు తావు లేకుండా, ఎన్నికలు తిరిగి నిర్వహించే అవసరం రాకుండా (జీరో వయలెన్స్.. నో రీపోల్), పూర్తి స్వేచ్ఛగా, సజావుగా ఈ దఫా సార్వత్రిక ఎన్నికలను నిర్వహించడమే లక్ష్యంగా ఎన్నికల కమిషన్ పనిచేస్తున్నదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. ఇదే లక్ష్యంతో కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని మందస, పలాస, నందిగాం మండలాల్లో శనివారం విస్తృతంగా పర్యటించారు. ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించి అధికారులకు కీలక సూచనలు చేశారు. ఇప్పటికే చేసిన ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం దిశానిర్దేశాల్లో ఎటువంటి తేడా వచ్చినా అందుకు సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు పటిష్టంగా పనిచేసేవిధంగా ముందుగానే తగు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఉండాలని సూచించారు. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, ఇవిఎంలు, స్ట్రాంగ్ రూమ్‌ల కోసం ఏర్పాట్లను ఆయా అధికారులంతా వేగవంతం చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ సూచనల ప్రకారం ఏర్పాట్ల విషయమై పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. భద్రతపరంగా ఎలాంటి ఇబ్బంది లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాల న్నారు. పోలింగ్ సిబ్బందికి సామగ్రిని అందించడంలో ఎలాంటి లోటుపాట్లు ఎదురుకాకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. నందిగాం మండలం ఆకులరఘునాథపురం 70వ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. అంతకుముందు తహశీల్దార్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణపై పలు సూచనలు, సలహాలు చేశారు. ఈయనతో పాటు టెక్కలి సబ్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి నూరల్ కమర్, తహశీల్దార్ వి.పద్మావతి, ఎంపిడిఒ జి.శివప్రసాద్, టెక్కలి డిఎస్‌పి బాలకృష్ణారెడ్డి, నందిగాం ఎస్ఐ మహమ్మద్ అమీర్ ఆలీ ఉన్నారు. అలాగే సిద్ధిగాం చెక్‌పోస్టును పరిశీలించారు. మందస మండలం చిన్నకోస్త 109వ పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించారు. అక్కడి నుంచి పలాసలోని ఎఫ్‌ఎస్‌టి బృందాన్ని సందర్శించి పనులపై ఆరా తీశారు. ఈయన వెంట ఆర్‌డిఒ భరత్ నాయక్, కాశిబుగ్గ డిఎస్‌పి నాగేశ్వరరెడ్డి, సిఐ ఈశ్వరరావు, అనిల్‌కుమార్ ఉన్నారు.

ముందస్తు వైద్య పరీక్షలు చేయించుకోవాలి

జిల్లా జడ్జి జునైడ్ అహ్మద్ మౌలానా

సోంపేట: ముందస్తు వైద్య పరీక్షల ద్వారానే కిడ్నీ వ్యాధి బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చని జిల్లా జడ్జి జునైడ్ అహ్మద్ మౌలానా అన్నారు. స్థానిక సిహెచ్‌సి కేంద్రం వద్ద శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఉద్దానం ప్రాంతంలో ప్రబలుతున్న కిడ్నీ వ్యాధి నిర్మూలనకు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిఒక్కరూ విధిగా వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. ఏవైనా అనారోగ్య సూచనలు కనిపిస్తే వెంటనే వైద్యుల సలహా మేరకు మందులు వాడాలని సూచించారు. కిడ్నీ వ్యాధి బారిన పడినవారు సైతం నిర్భయంగా ఉంటూ మందులు వాడడం, వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చు అన్నారు. రాష్ట్ర సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు కిడ్నీ వ్యాధిపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, జిల్లా వైద్యాధికారిని బొడ్డేపల్లి మీనాక్షి, సిఐ మల్లేశ్వరరావు, ఎస్ఐ అప్పలనాయుడు, ఎంపిడిఒ నీరజ, వైద్యులు భానుప్రకాష్ పాల్గొన్నారు.

కంచిలి : కంచిలి పిహెచ్‌సి వద్ద న్యాయ విజ్ఞాన సదస్సులో భాగంగా ఉచిత వైద్య శిబిరంలో కిడ్నీ వ్యాధిపై జిల్లా జడ్జి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు టి.హరిబాబు, ఎస్.నాగేందు, బి.హర్షిణి, రాకేష్, కవిత, ధనలక్ష్మి, సర్పంచ్ లక్ష్మి, ఎంపిటిసి యమున, టిడిపి నాయకులు జగదీష్ పట్నాయక్, ఎం.ఎం.పట్నాయక్ పాల్గొన్నారు.



కంచిలి : మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైడ్ అహ్మద్ మౌలానా

పలాస : మండలంలోని బొడ్డపాడు పిహెచ్‌సిలో న్యాయ విజ్ఞాన సదస్సును జిల్లా జడ్జి నిర్వహించారు. ఈ మేరకు 276 మంది రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలాస ఇన్‌ఛార్జి మెజిస్ట్రేట్ బిఎంఆర్ ప్రసన్నలత, సూపరింటెండెంట్ పాణిగ్రహి, వైద్యులు సునీల్‌కుమార్, మౌనిక, చిన్ని, దేవి, తేజేశ్వరరావు, సర్పంచ్, ఎంపిటిసి తామాడ మధన్, మద్దిల పాపారావు, పలాస బార్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.విశ్వేశ్వరరావు, పిండి వెంకటరావు, న్యాయవాదులు వాకాడ రవికుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఇచ్చినా అంగీకరించం

మాజీ మంత్రి అప్పలసూర్యనారాయణ

శ్రీకాకుళం అర్బన్: ఎమ్మెల్సీ పదవి ఇచ్చినా అంగీకరించబోమని మాజీ మంత్రి, టిడిపి సీనియర్ నాయకులు గుండ అప్పలసూర్యనారాయణ స్పష్టం చేశారు. అరసవల్లిలోని తన నివాసంలో కార్యకర్తలతోకలిసి శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. శ్రీకాకుళం అసెంబ్లీ అభ్యర్థిని పార్టీ అధిష్టానంప్రకటించి నుంచి వెంటిలేటర్‌పైనే ఉన్నామన్నారు. పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు పునరాలోచన చేసి సరైన నిర్ణయం తీసుకుని తన కుటుంబానికి ఊపిరిపోయాలని కోరారు. తన కుటుంబానికి నామినేటెడ్ పదవి అవసరం లేదని చెప్పారు. ప్రజల, కార్యకర్తల అజెండాయే తమ అజెండా అని అన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు లక్ష్మీదేవి వెంట నడిచిన వారంతా క్రమశిక్షణతో పనిచేశారని అన్నారు. పార్టీలో వర్గపోరుపై పలుమార్లు పార్టీ అధ్యక్షులు అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లినా పరిస్థితి చక్కదిద్దలేదన్నారు. పరిస్థితిని చక్కదిద్దాల్సిన బాధ్యత హైకమాండ్‌దేనన్నారు. ఇప్పటికైనా అధిష్టానం సరైన నిర్ణయం తీసుకుని కార్యకర్తల, ప్రజలు మనోభావాలను కాపాడాలని ఆకాంక్షించారు. సమావేశంలో పార్టీ నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింతు సుధాకర్, జిల్లా అధికార ప్రతినిధి ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, జల్లు రాజీవ్, కొర్ను నాగార్జున ప్రతాప్, జామి భీమశంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అప్పలసూర్యనారాయణ

'పది' పరీక్షా కేంద్రం వద్ద డిజె

- ఇబ్బందులకు గురైన విద్యార్థులు
- 144 సెక్షన్ నిబంధనలకు తూట్లు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలో జూనియర్ కళాశాల మైదానం నుంచి నిర్వహించిన ఎన్నికల అవగాహన బైక్ ర్యాలీ పట్ల అధికారులు వ్యవహరించిన తీరు పట్ల పదో తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేసారు. శనివారం రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్ పాల్గొనే బైక్ ర్యాలీ జూనియర్ కళాశాల మైదానం నుంచి ప్రారంభమైంది. ర్యాలీకి ముందు బిఎల్‌ఒలు, రెవిన్యూ అధికారులు సుమారు 40 నిమిషాల ముందే ద్విచక్ర వాహనాలతో ఇక్కడకు చేరుకున్నారు. డిజె సౌండ్ సిస్టం వాహనం, డప్పులు కొట్టే కళాకారుల మినీ లారీ మైదానానికి చేరుకున్నాయి. మైదానం పక్కనే 80 మీటర్ల దూరంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు పదో తరగతి పరీక్షలు 143 మంది విద్యార్థులు రాస్తున్నారు. అధికారులు వారిని పట్టించుకోకుండా డిజెలు, డప్పుల మోతలతో సుమారు 30 నిమిషాల వరకు పెద్దపెద్ద శబ్దాలతో దద్దరిల్లించారు. దీంతో పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు పరీక్షలు రాయడం మానేసి కళాశాల మైదానం వైపే దృష్టిని కేంద్రీకరించారు. పరీక్షా కేంద్రం బయట ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు ఈ సంఘటనతో నివ్వెరపోయి ఆందోళనకు గురయ్యారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ అధికారులు కూడా రాజకీయ నాయకులుగా మారారని, పక్కనే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతున్నప్పటికీ వారు కనీసం పట్టించుకోకుండా డిజె, డప్పుల శబ్దాలతో మారుమోగించడం శోచనీయమని అధికారుల తీరుపై అసహనాన్ని వ్యక్తం చేశారు. శనివారం ఫిజికల్ సైన్స్ పరీక్షను పిల్లలు రాస్తున్నారని, 50 మార్కుల ప్రశ్నాపత్రం కావడంతో రెండు గంటలు మాత్రమే కాలవ్యవధి ఉంటుందని అందులో సుమారు 30 నుండి 40 నిమిషాలు విద్యార్థుల సమయం వృధా అయిందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఇక్కడ పరీక్షా కేంద్రం ఉన్నట్లు తెలియకపోవచ్చునని, స్థానిక అధికారులకు ఏమైందని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా ప్రతి పరీక్షా కేంద్రం పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఈ విషయం కూడా అధికారులకు తెలియక పోవడం శోచనీయమని పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఇటువంటి ఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



పరీక్షా కేంద్రం వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

టిడిపిలో టిక్కెట్ల లొల్లి

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

టిడిపి మూడో జాబితా జిల్లాలో శ్రీకాకుళం, పాతపట్నం నియోజకవర్గాల్లో మంటలు రేపింది. ఆయా నియోజకవర్గాల్లో ఊహించని విధంగా అభ్యర్థులను మార్చడం ఇందుకు కారణంగా ఉంది. శ్రీకాకుళం నియోజకవర్గంలో గొండు శంకర్‌కు, పాతపట్నం నియోజకవర్గంలో మామిడి గోవిందరావుకు పార్టీ అధిష్టానం టిక్కెట్లు కేటాయించడంలో అసంతృప్తి జ్వాలలు ఎగిసిపడ్డాయి. శ్రీకాకుళం నియోకజకవర్గంలో అయితే ఏకంగా పార్టీ జెండాలను తగలబెట్టి తమ ఆగ్రహాన్ని వెళ్లగక్కారు. పార్టీ అధిష్టానం ఏకపక్షంగా వ్యవహరించడంపై కార్యకర్తలు కోపోద్రిక్తులయ్యారు. టిడిపి అధినేత చంద్రబాబు నమ్మించి, మోసం చేశారని మండిపడుతున్నారు. రెండో జాబితా విడుదల సందర్భంగా శ్రీకాకుళం స్థానాన్ని బిజెపికి కేటాయించారంటూ ప్రచారం జరిగింది. దీంతో నియోజకవర్గ టిడిపి కేడర్ భగ్గుమంది. ఎంపీ రామ్మోహన్‌నాయుడు నివాసం వద్ద ఆందోళనకు సైతం దిగారు. మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవికి టిక్కెట్ వచ్చేలా చేస్తానంటూ మాటవివ్వడంతో అప్పటికి శాంతించారు. టిక్కెట్ కచ్చితంగా వస్తుందని ధీమాగా ఉన్న గుండ అభిమానులు ఈ నెల 22న వెలువడిన మూడో జాబితాతో అనుకోని షాక్ తగిలింది. ఆమె స్థానంలో గొండు శంకర్‌కు టిక్కెట్ దక్కడంతో కార్యకర్తలు జీర్ణించుకోలేకపోయారు. జాతీయ పార్టీ అధినేత చంద్రబాబు, అచ్చెన్నాయుడు తీరుపై ఆగ్రహం వెళ్లగక్కారు. ఫొటోలు, పార్టీ జెండాలు, పోస్టర్లు తగలబెడుతూ కోపంతో ఊగిపోయారు. ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలంటూ నినాదాలు చేశారు. పార్టీ కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకుని అందుకనుగుణంగా వెళ్లాలని గుండ కుటుంబం ఆలోచిస్తోంది. అరసవల్లిలోని గుండ నివాసం వద్ద ఆదివారం సమావేశమయ్యేందుకు సిద్ధమవుతున్నారు. పాతపట్నం నియోజకవర్గంలోను అదే పరిస్థితి నెలకొంది. పాతపట్నం టిక్కెట్‌ను మామిడి గోవిందరావుకు కేటాయించడంపై పార్టీ శ్రేణులు భగ్గుమన్నాయి. కొత్తూరు మండలం మాతలలో సమావేశం నిర్వహించి పార్టీ కార్యకర్తలతో చర్చించిన తర్వాత భవిష్యత్ కార్యచరణ ప్రకటన ఉంటుందని కలమట వెంకటరమణ అనుచరులు చెప్తున్నారు. ప్రస్తుతం పరిస్థితి చూస్తే రెండుచోట్లా టిడిపికి ఇబ్బంది కలిగే పరిస్థితి కనిపిస్తోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా టిడిపి డబ్బులకు టిక్కెట్లను అమ్ముకుందనే ఆరోపణలను మూటకట్టుకుంది. ఎన్నికల ఖర్చును పూర్తిగా ఎవరు పెట్టుకోగలిగితే వారికే అధిష్టానం టిక్కెట్లను కేటాయించిందనే చర్చ నడుస్తోంది. ఖర్చుకు వెనుకడుగు వేసిన వారిని పక్కన పెట్టిందని నాయకుల్లో చర్చల్లో వ్యక్తమవుతోంది. అభ్యర్థుల నుంచి డబ్బులు తీసుకుని శ్రీకాకుళం, పాతపట్నం టిక్కెట్లను అమ్ముకున్నారంటూ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడుకు సైతం ఈ మరక అంటింది. ఎన్నికల్లో ఈ రెండు సీట్లు ఓడిపోతే దానికి రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు, ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడే కారణమంటూ పార్టీ శ్రేణులు నిందిస్తున్నాయి.

శ్రీకాకుళం, పాతపట్నం నియోజకవర్గాల్లో టిక్కెట్ల రాక భంగపడ్డ మాజీ ఎమ్మెల్యేలు తీవ్ర అవమానంతో రగిలిపోతున్నారు. నియోజకవర్గంలో ఉన్న పరిస్థితులను బట్టి ఫలానా వ్యక్తికి టిక్కెట్ ఇస్తున్నామని కనీసం మాట మాత్రంగానైనా చెప్పకుండా ప్రకటించడంపై వారు జీర్ణించుకోలేకపోతున్నారు. మీ నియోజకవర్గంలో ఎవరనైనా మారిస్తే మీకు ఫోన్ చేసి చెప్తానని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవితో చంద్రబాబు అన్నట్లు తెలిసింది. నమ్ముకున్న జనాన్ని మోసం చేసినట్లే సొంత పార్టీ నాయకులనూ బాబు ఇలా మోసం చేస్తారని అనుకోలేదని వారు గుండ అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. పాతపట్నంలో మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణకు రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు నుంచి ఇదే అనుభవం ఎదురైంది. ఉదయం పది గంటలకు తాను ఫోన్ చేస్తే నీకే టిక్కెట్ అంటూ చెప్పి మోసం చేశారని కలమట మండిపడుతున్నారు.

శ్రీకాకుళం నియోజకవర్గంలో కాస్తాకూస్తో ఊగిసలాటలో ఉన్నా పాతపట్నం నియోజకవర్గంలో మాత్రం కేడర్‌లో కొంత స్పష్టత కనిపిస్తోంది. తమ నేతకు టిక్కెట్ రాకపోవడానికి కింజరాపు కుటుంబమే కారణమంటూ కేడర్ ప్రతీకారానికి సిద్ధమవుతోంది. కార్యకర్తల అభిష్టానికి అనుగుణంగా నిర్ణయం తీసుకుంటానని పైకి చెప్తున్నా... ఇండిపెండెంట్‌గా బరిలో దిగాలని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ నిర్ణయించినట్లు తెలిసింది. శ్రీకాకుళం నియోజకరవర్గంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవికి టిక్కెట్ రాకపోవడానికి అచ్చెన్నాయుడే కారణమంటూ కేడర్ నిందిస్తోంది. గుండ కుటుంబాన్ని అణగదొక్కేందుకు ఒక పథకం ప్రకారం ఇలా చేశారని వారు చెప్తున్నారు. నియోజకవర్గంలో బలహీన అభ్యర్థిని నిలబెట్టించడం ద్వారా ధర్మాన ప్రసాదరావు గెలుపునకు దోహదపడాలన్నది అచ్చెన్న వ్యూహమని వారు అంటున్నారు. గుండ కుటుంబానికి జరిగిన అన్యాయంపై తాడోపేడో తేల్చుకోవాలని కేడర్ భావిస్తోంది. ఇండిపెండెంట్‌గా బరిలో దిగాలని గుండ లక్ష్మీదేవిపై ఒత్తిడి చేస్తోంది. శ్రీకాకుళం, పాతపట్నం నియోజకవర్గాల్లో ఇద్దరు సీనియర్ మాజీ ఎమ్మెల్యేలు ఇండిపెండెంట్లుగా బరిలో దిగితే దాని ప్రభావం ఎంపీ రామ్మోహన్ నాయుడుపై పడనుంది. అచ్చెన్నాయుడును దెబ్బతీసే అవకాశం లేకపోవడంతో ఆ నష్టం ఎంపీ రామ్మోహన్ నాయుడుకి తగలనుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. రెండు నియోజకవర్గాల్లో మాజీ ఎమ్మెల్యే కేడర్, అభిమానులు, సానుభూతిపరులు ఎంపీ కాదని వేరే అభ్యర్థికి ఓటేస్తే టిడిపి ఎంపీ సీటును కోల్పోయే ప్రమాదముందనే ఆందోళన కేడర్‌లో కనిపిస్తోంది. దీంతో పాటు రెండు నియోజకవర్గాల్లోనూ టిడిపికి నష్టం వాటిల్లే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఎచ్చెర్ల సీటు బిజెపికి కేటాయిస్తారనే ప్రచారం జరుగుతోంది. దీంతో ఆ సీటునూ వదులుకోవాల్సిందేనని పలువురు టిడిపి నాయకులు లెక్కలు వేస్తున్నారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకునే అభ్యర్థులను నిర్ణయించామని అధినేత చంద్రబాబు చెప్తుంటే... జిల్లాలో మాత్రం వేరే ప్రయోజనాలు కోసం పార్టీ పెద్దలు రాజకీయ క్రీడ ఆడుతున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. మొత్తం మీద బిజెపితో పొత్తు, అభ్యర్థుల మార్పుతో జిల్లాలో టిడిపి గట్టి దెబ్బే తగిలే సూచనలు కనిపిస్తున్నాయి.


బూర్జ : వివరాలు అడిగి తెలుసుకుంటున్న జెసి నవీన్

పక్కాగా ఎన్నికల నియమావళి

ప్రజాశక్తి- బూర్జ

ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ ఆదేశించారు. మండలంలోని తుడ్డలి, లక్కుపురం, డొంకలపర్త, డి.జె.పురం, అల్లెన గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంతరాలకు తావులేకుండా అన్ని నియమాలనూ పార్టీలకతీతంగా పాటించాలన్నారు. రూట్, పోలింగ్ అధికారులు నిరంతరం పోలింగ్ బూత్‌లను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఈయన వెంట తహశీల్దార్ అంబేద్కర్, ఎంపిడిఒ రవీంద్రకుమార్, వ్యవసాయశాఖ అధికారి వి.రాజేశ్వరరావు, విఆర్ఒ రమేష్‌కుమార్, కార్యదర్శి రామకృష్ణ ఉన్నారు.

తనిఖీలు ముమ్మరం

పొందూరు: సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో వాహనాల తనిఖీలను ముమ్మరం చేయాలని ఎన్నికల అధికారులను జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ ఆదేశించారు. మండలంలోని రాపాక కూడలిలో ఫ్లయింగ్ స్క్వాడ్ చేపడుతున్న తనిఖీలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. అలాగే మండలంలోని బురిడికంచరాంలో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. పోలింగ్ కేంద్రాల పరిశ్రమ పరిశీలించి అక్కడ కల్పించాల్సిన పలు సదుపాయాలపై అధికారులకు సూచనలు చేశారు. ఈయన వెంట ఎంపిడిఒ సిహెచ్.సూర్యనారాయణ, తహశీల్దార్ ఎం.పాల్‌కిరణ్, ఆర్ఐ రాధ పాల్గొన్నారు.

'పది' పరీక్షకు 720 మంది గైర్హాజరు

శ్రీకాకుళం అర్బన్ : పదో తరగతి పరీక్షల్లో శనివారం ఫిజికల్ సైన్స్ పరీక్ష జరిగిందని డిఇఒ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ పరీక్షకు జిల్లావ్యాప్తంగా 720 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని అన్నారు. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 145 పరీక్షా కేంద్రాల్లో 29,886 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 29,166 మంది హాజరైనట్లు తెలిపారు. జిల్లాలో 97.59 శాతం మంది విద్యార్థులు పరీక్ష రాశారని చెప్పారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు నమోదు కాలేదన్నారు. 15 కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్, పది కేంద్రాల్లో ఫ్లైయింగ్ స్క్వాడ్ సందర్శించారని తెలిపారు.

రవిశంకర్‌కి డాక్టరేట్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్


పిహెచ్‌డి పట్టా అందుకుంటున్న రవిశంకర్

నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల గణితశాస్త్ర అధ్యాపకులు రోణంకి రవిశంకర్ డాక్టరేట్ పట్టాపొందారు. పి లాప్లేసియన్ ఆపరేటర్‌తో అధిక తరగతి సరిహద్దు విలువ సమస్యల సానుకూలత అనే అంశంపై పరిశోధనకు గీతం యూనివర్సిటీ నుంచి పిహెచ్‌డిని పొందారు. డాక్టర్ నంబూరి శ్రీధర్ పర్యవేక్షణలో రవిశంకర్ పరిశోధన చేసినందుకు పిహెచ్‌డి పొందారు. ఈ పరిశోధనలు విద్యార్థులకు, అధ్యాపకులకు, పరిశోధకులకు ఎంతగానో ఉపయోగపడతాయని గీతం యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ గుణశేఖర్ అవార్డు ప్రదానం సందర్భంగా పేర్కొన్నారు. రవిశంకర్‌కి డాక్టరేట్ లభించడంపై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ, వైస్ ప్రిన్సిపాల్ ఎం.వి. సత్యనారాయణ అభినందనందించారు.

తూతూమంత్రంగా మండల సమావేశం

బూర్జ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం తూతూ మంత్రంగా మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపిపి కర్నేన దీప ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ప్రజా ప్రతినిధులు, మండల శాఖ అధికారులు పాల్గొన్నారు. ఎంపిడిఒ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సమయం అయినప్పటికీ 90 రోజులలోపు సర్వసభ్య సమావేశం నిర్వహించాల్సి ఉన్నందున ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో ఎటువంటి అంశాలపై చర్చ జరగలేదు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపిలు బొడ్డేపల్లి సూర్యారావు, కరణం కృష్ణంనాయుడు, డిసిఎంఎస్ సభ్యులు జల్లు బలరాం నాయుడు, సిడిపిఒ గీతారాణి, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇఇ నాయుడు, మండల ఇంజనీరింగ్ అధికారి మౌనిక, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


పాల్గొన్న టిడిపి అభ్యర్థులు

వర్క్‌షాపులో టిడిపి అభ్యర్థులు

శ్రీకాకుళం అర్బన్ : విజయవాడలోని ఎ1 కన్వెన్షన్‌లో ఎన్నికల దృష్ట్యా శనివారం టిడిపి ప్రత్యేక వర్క్‌షాపు నిర్వహించారు. జిల్లా నుంచి ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఆమదాలవలస, ఇచ్ఛాపురం, నరసన్నపేట, శ్రీకాకుళం, పలాస, పాతపట్నం నియోజకవర్గాల అభ్యర్థులు కూన రవికుమార్, బెందాళం అశోక్, బగ్గు రమణమూర్తి, గొండు శంకర్, గౌతు శిరీష, మామిడి గోవిందరావు పాల్గొన్నారు.

ప్రవీణ్‌కుమార్‌కు ఆర్థికసాయం

నందిగాం: మండలంలోని పాలవలసకు చెందిన నులక ప్రవీణ్ కుమార్ అనారోగ్యానికి గురైయ్యాడు. దీంతో గ్రామానికి చెందిన కూరాకుల యాదవ్ చొరవతో హైదరాబాద్ వాస్తవ్యులు ఎన్విరాల్‌మెంట్ కన్సల్టెన్సీ సాయిప్రసాద్ సాయంతో బాధిత కుటుంబసభ్యులకు రూ.5వేలు ఆర్థికసాయం శనివారం అందించారు. కార్యక్రమంలో లుకాలపు రంజిత్ కుమార్, కాంచరణ సాయిప్రతాప్, మాజీ సర్పంచ్ అక్కురాడ కూర్మరావు, మట్ట ప్రసాద్, రఘుపతి, మట్ట పాపారావు, కృష్ణ పాల్గొన్నారు.

క్రీడల్లో సత్తా చాటాలి

శ్రీకాకుళం అర్బన్ : జమ్మూ-కాశ్మీర్‌లో ఈ నెల 26 నుంచి 31 వరకు జరగనున్న జాతీయ స్థాయి సబ్‌జూనియర్ ఉషు ఛాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటాలని జిల్లా క్రీడాభివృద్ధిశాఖ అధికారి శ్రీధర్ సూచించారు. నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జాతీయస్థాయి పోటీలకు బయలుదేరి వెళుతున్న క్రీడాకారులకు శనివారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురైన జిల్లా క్రీడల్లో ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. నాటి క్రీడాకారుల స్ఫూర్తితో జాతీయ స్థాయి పోటీల్లో సత్తాచాటి జిల్లాకు మంచి పేరు తీసుకురావలన్నారు. ఉషు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి శివకుమార్ మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీలకు జిల్లా నుంచి 18 మంది క్రీడాకారులు ఎంపికయ్యారన్నారు. వారంతా జాతీయస్థాయి పోటీలకు పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ సలహాదారు సుందరరావు, వాకర్స్ డెప్యూటీ గవర్నర్ ఎస్.జోగినాయుడు, తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమర భాస్కరరావు, టీం కోచ్ కొమర మోహనకృష్ణ, టీం మేనేజర్ రెడ్డి సాయిరాం పాల్గొన్నారు.

శీతల పానీయాలు పంపిణీ

కవిటి : పదో తరగతి పబ్లిక్ పరీక్షల సమయంలో ఎండ తీవ్రత దృష్ట్యా గత నాలుగు రోజులుగా బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద గ్రామ యువత పలు రకాల పానీయాలు పంపిణీ చేస్తోంది. అందులో భాగంగా ఐదోరోజు గ్రామానికి చెందిన ఎన్ భాస్కర్ ఆర్థికసాయంతో సుమారు 350 మంది విద్యార్థులకు శీతల పానీయాలు పంపిణీ చేశారు. అనంతరం గ్రామ యువత మాట్లాడుతూ దాతల సహకారంతో పదోతరగతి పరీక్షలు పూర్తయ్యే వరకూ కొనసాగిస్తామని తెలిపారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి


ఆమదాలవలస : బైక్ ర్యాలీలో పాల్గొన్న రిటర్నింగ్ అధికారి నవీన్


ఇచ్ఛాపురం : ర్యాలీలో పాల్గొన్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుదర్శన్‌దొర

ఆమదాలవలస : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం స్వీప్ అవగాహన కార్యక్రమంలో భాగంగా పట్టణంలో జూనియర్ కళాశాల మైదానం నుంచి కృష్ణాపురం జంక్షన్ అక్కడి నుంచి రైల్వేస్టేషన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని, ప్రజలకు అవగాహన కల్పించడం కోసమే ఈ బైక్ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద బిఎల్‌ఒలు ఉంటారని ప్రజలు తమ ఓటును పరిశీలించుకోవచ్చునని తెలిపారు. మంచి పాలకులను ఎన్నుకునేందుకు ప్రజలు ఓటింగ్‌లో ఎక్కువగా పాల్గొని ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల డిటి మురళీధర్ నాయక్, నాలుగు మండలాల తహశీల్దార్లు, బిఎల్‌ఒలు, రెవిన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జాయింట్ కలెక్టర్ నవీన్

ఓటు హక్కు వినియోగంపై మహిళా సమాఖ్య కార్యాలయం నుంచి అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిఎం పైడి కూర్మారావు, మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు ధనలక్ష్మి, వేణమ్మ పాల్గొన్నారు.

నందిగాం : మండలంలోని సైలాడ, బంజీర్‌పేట, పెంటవూరు, కవిటి అగ్రహారం, పెద్దబాణాపురం గ్రామాల్లో ఎపిఎం జాంభవతి ఆధ్వరాన ఓటు హక్కు వినియోగంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: రానున్న ఎన్నికల్లో ప్రశాంతంగా ఓటర్లు తమఓటు హక్కును వినియోగించుకోవాలని ఓటర్లుకు అవగాహన కల్పిస్తూ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుదర్శన్ దొర అధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం నుంచి బిఎల్‌ఒలు, ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందితో పట్టణ పురవీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు.

పొందూరు: గ్రామాల్లో ఓటుహక్కు వినియోగంపై మహిళలను చైతన్యవంతం చేయాలని ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ అన్నారు. మండల పరిషత్ ఆవరణలో వెలుగు ఎపిఎం శ్యామలరావు ఆధ్వర్యంలో మహిళలకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఓటుహక్కు ప్రాధాన్యంపై మానవహారం నిర్వహించి నినాదాలు చేశారు. వెలుగు ఎసి రవికుమార్, విఒఎలు పాల్గొన్నారు.

జి.సిగడాం: మండలం కేంద్రంలో ఎపిఎం రామకృష్ణ నాయుడు ఆధ్వర్యంలో ఓటుహక్కు వినియోగంపై ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎసి రవికుమార్, గ్రామ సంఘ సభ్యులు, మండల సమైఖ్య ఒబిలు, సిసిలు, విఒఎలు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండల కేంద్రంలో తహశీల్దార్ లచ్చపాత్రో ఆధ్వర్యంలో ఓటుహక్కు వినియోగంపై కోటబొమ్మాళి నుంచి కొత్తపేట వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవ హారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎచ్చర్ల పద్మజ, డిపిఎం, వెలుగు ఎసి వైకుంఠరావు, ఉపాధిహామీ క్లస్టర్ జెఇ జి.హరిప్రసాద్, డిటి రాము, వెలుగు సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


కోటబొమ్మాళి : మానవహారం నిర్వహిస్తున్న అధికారులు


పొందూరు : ఓటుహక్కుపై నినాదాలు చేస్తున్న మహిళలు


జి. సిగడాం : ర్యాలీ నిర్వహిస్తున్న వెలుగు సిబ్బంది, మహిళలు

టెక్కలి రూరల్: మండలంలోని జయకృష్ణాపురంలో వెలుగు సిబ్బంది ఆధ్వర్యాన మహిళలందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలంటూ ర్యాలీ నిర్వహి ంచారు. సిసిలు నీలవేణి, వరదరాజులు, విఎఒ భవానీ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ జీవితం యువతకు స్ఫూర్తి


రణస్థలం : భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న సిఐటియు నాయకులు


పలాస : నివాళ్లర్పిస్తున్న రైతు సంఘం, సిఐటియు నాయకులు

రణస్థలం : భగత్ సింగ్ జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు అన్నారు. పైడిభీమవరంలో శ్యాంపిస్టన్స్ పరిశ్రమ వద్ద భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రిటిష్ దాస్య శృంఖలాల నుంచి భారత దేశాన్ని విముక్తి చేయడానికి తన ప్రాణాలనే తృణప్రాయంగా అతి చిన్న వయసులోనే భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్‌లు ఉరికంబ మెక్కిన రోజు అని అన్నారు. భావితరాలకు భగత్‌సింగ్ ఎప్పటికీ స్ఫూర్తి ప్రదాతేనని అన్నారు. కార్యక్రమంలో జి.కిరణ్, ఆర్.ఎస్.నాయుడు, గురు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

లావేరు : మండలంలోని అదపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భగత్‌సింగ్, రాజ్‌గురు వర్ధంతి వేడుకల్లో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, జన విజ్ఞాన వేదిక పర్యావరణ కమిటీ జిల్లా కన్వీనర్ అగతముడి వాసుదేవరావు, విద్యా విభాగం కోకన్వీనర్ బొడ్డేపల్లి జగన్నాథరావు, సీనియర్ నాయకులు పుట్ట ఉదయ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు నీలంరాజు పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలోని గొట్టిపల్లిలో భగత్‌సింగ్, రాజ్‌గురు చిత్రపటాలకు గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గిరిజన యువకులు ఆరిక శివ, పాలక శేషగిరి, గేదెల ఎండయ్య, గేదెల ధర్మారావు, సవర సొంబురు, సవర దుర్గారావు పాల్గొన్నారు.

పలాస: మందస మండలం సిఐటియు కార్యాలయంలో భగత్ సింగ్ 93 వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఎపి రైతు సంఘం మండల కార్యదర్శి మట్ట ధర్మారావు అధ్యక్షతన జరిగిన సభలో ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.మోహనరావు, టి.గణేష్, వడ్డీ గోపాలకృష్ణ మాట్లాడుతూ భగత్ సింగ్ భారతదేశానికి సంపూర్ణ స్వతంత్రం కావాలని బ్రిటిష్ వాళ్లకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు టి.లక్ష్మీనారాయణ, ఎస్.వల్లభ, ఎస్ చిరంజీవి, వెంకటేష్, ఎస్.జగ్గారావు, వెంకటరావు పాల్గొన్నారు.

కవిటి: స్థానిక కల్యాణి ఆంగ్ల పాఠశాలలో రాజగురు సుఖ్ దేవ్, భగత్ సింగ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బిందుమాధవి అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. విద్యార్థులు కొవ్వొత్తుల ప్రదర్శనతో మౌనం పాటించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నందిగాం: పెద్ద తామరపల్లి ప్రాథమిక పాఠశాల హెచఎం కె.గున్నయ్య ఆధ్వర్యంలో పాఠశాలలో అమరవీరులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళ్లర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శంకరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: సిఐటియు కార్యాలయం సిపిఎం నాయకులు నంబూరు షన్ముఖరావు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. సిపిఎం నాయకులు ఎల్లయ్య, వాసుదేవరావు, దుర్గారావు పాల్గొన్నారు.


కవిటి : చిత్రపటం వద్ద కొవ్వొత్తులతో నివాళ్లర్పిస్తున్న విద్యార్థులు


నందిగాం : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఎచ్చెర్ల : ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో భగత్ సింగ్ వర్ధంతి నిర్వహించారు. ఎల్ఐసి ఉద్యోగి టేకి ఆచారి భగత్ సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం హరికృష్ణ, అధ్యాపకులు, యువకులు బి.నగేష్, కె.ప్రకాష్, డి.శంకర్, ఎ.శశికుమార్, ఎం. రాజు, కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి : స్థానిక సిపిఎం కార్యాలయంలో భగత్ సింగ్ చిత్రపటానికి జిల్లా కార్యదర్శి దొండపాణి రైతో, ఎఐకెఎస్ జిల్లా కార్యదర్శి ముచ్చి బంగారు, గజపతి జిల్లా రైతు కూలీ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రొక్కం లోకనాథం, సిపిఐఎంఎల్ సభ్యులు శ్రీను బెహరా, యువనేత బాణీప్రసాద్ మాలి, సంజీవ్ అశోక్, కామేష్ సాహు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

ఆరో రోజుకు శిబిరాలు


నరసన్నపేట : మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయంలో జాతీయ సేవా పథకం సేవా శిబిరం యూనిట్-1 ఆధ్వర్యంలో ఆరవ రోజు ఎస్.ఎం.పురంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, శివాలయం పరిధిలో హెచ్ఎం కె.రమణమ్మ ఆధ్వర్యంలో మామిడి, నేరేడు, జామ, ఉసిరి మొక్కలు నాటారు. అనంతరం మొక్కలు నాటాలి, భూతాపం తగ్గించాలని ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే ఎచ్చెర్ల గ్రామంలో యూనిట్-4 ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థుల్లో సృజనాత్మకతపై అవగాహన కల్పించారు. అనంతరం రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించే విధంగా ధ్యానం, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డా.పెద్దింటి ముకుంథరావు, పిఒలు డా.వి.సింహాచలం, డా.జి.ఈశ్వరరావు, వలంటీర్లు పాల్గొన్నారు.

నరసన్నపేట : స్థానిక ఎల్‌విఆర్ డిగ్రీ కళాశాలలో ఆరవ రోజు ప్రత్యేక శిబిరంలో వలంటీర్లు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఎడి జివి జగన్నాథం ప్లాస్టిక్ నిషేదంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసాదరావు, పోగోటి మోహనరావు, వి.రత్నమాల, ఎల్.ఎల్లమ్మ పాల్గొన్నారు.


టెక్కలి : సేంద్రియ ఎరువులపై అవగాహన కల్పిస్తున్న వలంటీర్లు

టెక్కలి: మండలంలోని ధర్మనీలాపురంలో టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మూడవ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాన్ని పాలిటెక్నికల్ కళాశాల అధ్యాపకులు ఎస్.తిరుపతిరావు సందర్శించారు. వలంటీర్లు ఇంటింటికి వెళ్లి సేంద్రీయ ఎరువుల తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పిఒ డి.వాసుబాబు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోవిందమ్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బెపల సతీష్ కుమార్, కో-ఆర్డినేటర్ లుక్ పాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం

పలాస : నియోజకవర్గంలో టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థిగా బరిలో నిలిచిన గౌతు శిరీష గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని జనసైనికులు స్పష్టం చేశారు. టిడిపి కార్యాలయంలో మాజీ మంత్రి గౌతు శివాజీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ నియోజకవర్గంలో గత ఐదేళ్లుగా దోపిడీ, అరాచకం రాజ్యమేలుతున్నాయని వాటికి అడ్డుకట్ట వేసే సమయం ఆసన్నమైందన్నారు. ప్రజలు ఈ అరాచక ప్రభుత్వానికి చరమగీతం పాడాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బడ్డ నాగరాజు, సప్ప నవీన్, జనసేన ఉత్తరాంధ్ర కార్యనిర్వహణ కమిటీసభ్యులు సంతోష్ పండా, కిల్లి బాలకృష్ణ, బంగారు కేధార్‌నాథ్, మేడిశెట్టి నరసింహామూర్తి, సవర సుమన్ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: మండలం తేలినీలాపురంలో టిడిపి సూపర్ సిక్స్, బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీపై మండల అధ్యక్షులు బగాది శేషగిరిరావు శనివారం పోస్టర్లు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ఇంటింటికి వెళ్లి టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అందించబోయే పథకాలను వివరించారు. కార్యక్రమంలో హనుమంతు రామకృష్ణ, చాపర గణపతిరావు, మామిడి రాము, ఇప్పిలి జగదీష్, పేడాడ రాజారావు, రోణంకి మల్లేష్, పాల్గొన్నారు.

స్మారక కమిటీ ఏర్పాటు

వజ్రపుకొత్తూరు: విప్లవ పోరాట యోధులు పోతనపల్లి కుమారన్న, జయక్క స్మారక కమిటీని నూతనంగా ఏర్పాటు చేసారు. శనివారం మర్రిపాడులో అమర వీరుల స్మారక స్థూపం వద్ద కమిటీ సమావేశం ఏర్పాటు చేసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా గొరకల బాలకృష్ణ, కార్యదర్శి పోతనపల్లి మల్లేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా కుత్తుం హేమక్క, సహాయ కార్యదర్శిగా రాపాక మాధవరావు, కోశాధికారిగా పి.కుసుమలను ఎన్నుకున్నారు. అదేవిధంగా కార్యవర్గసభ్యులుగా బర్ల గోపి, జె.అప్పయ్య, గర్తం కామేశ్వరరావులను ఎన్నుకున్నారు.

వైసిపి ఇంటింటా ప్రచారం


పలాస : ప్రచారం చేస్తున్న వెంకటరావు

ప్రజాశక్తి- పొందూరు

పట్టణంలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి, స్పీకర్ తమ్మినేని సీతారాం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మరొక అవకాశాన్ని కల్పించాలన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్ కుమార్, వైసిపి రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి బండారు జై ప్రతాప్ కుమార్, వైసిపి నాయకులు గుడ్ల మోహన్, అనకాపల్లి గోవింద్ పాల్గొన్నారు.

పలాస: నియోజకవర్గంలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు గెలుపే లక్ష్యంగా పని చేస్తున్నామని పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి, వైఎస్ ఎంపిపి తలగాన శ్రీరాములు అన్నారు. మండలంలోని పెదంచల, మరదరాజపురంలో శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా అప్పలరాజు పదవి చేపట్టి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. మరలా ఆయను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వరిశ రామారావు, మండల సచివాలయ కన్వీనర్ దువ్వాడ రవి కుమార్, ఎంపిటిసి గొండు మోహనరావు, పైల చలం, నాయకులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలం విశ్వనాధపురం సర్పంచ్ పంకు ప్రభావతి ఆధ్వర్యంలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు నూక సత్యరాజు ఇంటింటికి వెళ్ళి టెక్కలి ఎమ్మెల్యేగా దువ్వాడ శ్రీనివాస్, శ్రీకాకుళం పార్లమెంటు అభ్యర్థిగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, సచివాలయ కన్వీనర్ గడ్డవలస నాగభూషణరావు, మండల విప్ బొడ్డు అప్పన్న, నాయకులు కవిటి రామరాజు, మెట్ట సింహాచలం పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: మండలం బొడ్డపాడు పంచాయితీ నారాయణపురంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ ప్రతినిధి, వైసిపి జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు పాలిన శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శాంతారావు, బొడ్డపాడు సర్పంచ్ ఢిల్లీరావు,మాజీ సర్పంచ్ ఉప్పాడ ఆనందరావు పాల్గొన్నారు.

రణస్థలం: మండలంలోని రణస్థలంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ సతీమణి, రణస్థలం మండలం మాజీ ఎంపిపి గొర్లె పరిమళ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే కిరణ్ కుమార్‌ని అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రణస్థలం : ప్రచారం చేస్తున్న పరిమళ

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలం నిమ్మాడ కాలనీకి చెందిన ఆవాల రాజారావు (52) పురుగుల మందు తాగి శనివారం మృతి చెందినట్టు స్థానిక ఎస్ఐ షేక్ మహ్మద్‌అలీ తెలిపారు. మృతుడు భార్య ఆవాల తవిటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడు గత కొనేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, బాధ తట్టుకోలేక పురుగుల మందు తాగాడని, వెంటనే శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని మృతుడు భార్య ఫిర్యాదులో పేర్కొన్నట్టు ఎస్ఐ తెలిపారు.

మహిళ మృతి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి


మృతి చెందిన పార్వతి

మండల కేంద్రంలో స్టేట్‌బ్యాంకు సమీపంలో పలాసకు చెందిన బతకల పార్వతి (45) శనివారం ఆటో నుంచి జారిపడి మృతి చెందింది. పోలీసుల వివరాలు మేరకు మృతురాలు కోట బొమ్మాళికి చెందిన వంట మాస్టర్ మురళీ వద్ద కేటరింగ్ పనులకు రెండురోజులు క్రితం మరో ఇద్దరితో పలాస నుంచి కోటబొమ్మాళికి వచ్చి తిరిగి శనివారం తన గ్రామం పలాస వెళ్లేందుకు సినిమాహాల్ వద్ద ఆటో ఎక్కి కొత్తపేట వెళ్తుండగా స్టేట్‌బ్యాంకు సమీపంలో ఆటో గుంతలో దిగి ఊగటంతో ఆటోలో ఉన్న పార్వతి కిందపడిపోయింది. తలకు తీవ్ర గాయాలవ్వడంతో 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా అమె మృతి చెందినట్టు పోలీస్‌లు తెలిపారు. ఎస్ఐ షేక్‌మహ్మద్ అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

వైసిపి మండల అధ్యక్షునిగా సతీష్

ప్రజాశక్తి- నౌపడ


సతీష్

వైసిపి మండల అధ్యక్షునిగా సంతబొమ్మాళి మండలం కోటపాడుకు చెందిన యువ నాయకుడు కోత సతీష్‌ను అధిష్టానం నియమించింది. శుక్రవారం టెక్కలి నియోజకవర్గంలోని నాలుగు మండలాల పార్టీ కమిటీసభ్యుల జాబితాలను వైసిపి కేంద్ర పార్టీ కార్యాలయం విడుదల చేసింది. అధ్యక్షునిగా ఎన్నికైన కొత్త సతీష్‌కు జెడ్‌పిటిసి పాల వసంత రెడ్డి, ఎంపిపి మేరుగు రాజేశ్వరి, పిఎసిఎస్ చైర్మన్ కెళ్లి జగన్నాయకులు, వైస్ ఎంపిపిలు తులసమ్మ, చింతామణి, భీమారావు, రామకృష్ణ, సర్పంచ్‌లు అభినందనలు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను శనివారం ఎంసిసి బృందం పరిశీలించారు. ఎంపిడిఒ ఎస్.కొండలరావు అధ్వర్యంలో బృందం పోతయ్యవలస, గోవిందపురం, ఇజ్జడాపాళెం, బారణికం, పెద్దకొత్తకోట, చిన్నకొత్తకోట గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. మౌలిక సదుపాయాలు, విద్యుత్ తదితర అంశాలను పరిశీలించారు. అలాగే గ్రామాల్లో ఎన్నికల కోడ్ పక్కగా అమలు జరిగేలా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో బృంద సభ్యులు వై.మాధవరావు, సచివాలయం సిబ్బంది ఉన్నారు.


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

ఆరోగ్యంపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి- సోంపేట

వరల్డ్ హెల్త్ డే పురస్కరించుకొని బారువ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నోటి రక్షణ, శరీర రక్షణ అంటూ నినాదాలు చేస్తూ వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. వైద్యులు హుస్సేన్, కె.బాలకృష్ణ, దుర్యోధన, హేమంత్, నరసింహ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. నోటి రక్షణ ద్వారానే సంపూర్ణమైన ఆరోగ్యాన్ని పొందవచ్చని తెలిపారు. వైద్యులతో పాటు ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌టిసి డ్రైవింగ్ స్కూల్ బ్యాచ్ ప్రారంభం

శ్రీకాకుళం అర్బన్ : ఎపిఎస్ ఆర్‌టిసి హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పొందడానికి 15వ బ్యాచ్‌ను శ్రీకాకుళం-1 డిపో మేనేజర్ పి.బి.ఎం.కె.రాజు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్‌టిసి హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో ఇప్పటి వరకు 14 బ్యాచ్‌లకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. శిక్షణ పొందిన వారికి డ్రైవింగ్‌లో పూర్తి సామర్థ్యం వస్తుందన్నారు. ఆర్‌టిసిలో శిక్షణ తీసుకోవడం వల్ల బస్‌లు అందుబాటులో ఉంటాయని, వాటిలోనే శిక్షణ పొందడానికి వీలుంటుందని అన్నారు. దీనికి తోడు గ్యారేజీ సౌకర్యం ఉండడం వల్ల మెకానికల్, ఎలక్ట్రికల్ వర్క్ పూర్తిగా నేర్చుకునేందుకు వీలవుతుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలతో పాటు హెవీ లైసెన్స్‌ను ఆర్‌టిసి డ్రైవింగ్ స్కూల్ ద్వారా ఇస్తామని చెప్పారు. అలాగే యోగా, ప్రథమ చికిత్స, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉంటుందని అన్నారు. ఈ సౌకర్యాన్ని డ్రైవర్లు సద్వినియోగపర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం-2 డిపో మేనేజర్ కె.ఆర్.ఎస్.శర్మ, డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కవిటి: మండలంలో కొత్తగా ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్ కోసం రాజపురం నుంచి వేస్తున్న 33 కెవి పనుల నిమిత్తం ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ జి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 11కెవి కవిటి టౌన్ లైన్ మెంటెనెన్స్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో కవిటి, కొత్తూరు, గొండ్యాలపుట్టుగ, ప్రగడపుట్టుగ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

పొందూరు: ఎన్నికల సమయంలో గ్రామాల్లో గొడవలు లేకుండా ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యమని ఎస్ఐ వై.రవికుమార్ అన్నారు. మండలంలోని తోలాపి, బురిడీ కంచరాంలో శనివారం ప్రత్యేక బలగాలతో కవాతు నిర్వహించారు. కవాతులో భారీగా బలగాలు, స్థానిక పోలీసులు, ఎఎస్ఐ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.